సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 5 । ఫిబ్రవరి । 2023



ఈ సారైనా 'దూరం' తగ్గేనా..?

ఈనెల 9 నుంచి కేయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అయితే ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో కేంద్రాలు దూరంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. 8లో▸

ఎడ్లపురంలో ఎములాడ పోచమ్మ



రెండున్నర శతాబ్దాల చరిత గల ఆలయమిది. భక్తుల కోరిన కోరికలు తీరుస్తూ ఎడ్లపురంలో ఎములాడ పోచమ్మగా ప్రసిద్ధి చెందిన ఆలయంపై ప్రత్యేక కథనం. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0/12.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రివేళలో చలితీవ్రత పెరగనుంది. వేకువజామున పొగ మంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన అధికారులు



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

కైలాస్‌నగర్: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌రాజ్‌ను పలువురు జిల్లా అధికారులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్ కుమార్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందజేసి అభినందించారు. తమను పరిచయం చేసుకున్నారు.

నేటి నుంచి బోదకాలు గుర్తింపు సర్వే



కిట్లను అందజేస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కొత్తగా బోదకాలు (ఫైలేరియా) కేసులను గుర్తించేందుకు పది గ్రామాలను ఎంపిక చేసినట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు, సబ్‌యూనిట్ అధికారులు, నోడల్ పర్సన్స్‌కు స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం శిక్షణ నిర్వహించారు. వారికి సర్వే కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోచ్చర, జైనథ్, బేల, కప్పర్ల, ధన్నూర్, కామగిరి, చెప్రాల, తేజాపూర్, ఫకీరగుట్ట, ఇందిరమ్మ కాలనీల్లో రాత్రి వేళల్లో బ్లడ్ సర్వే చేపడుతారన్నారు. ఈ నెల 5నుంచి 10 వరకు రాత్రి 8:30 నుంచి 12 గంటల వరకు ఈ సర్వే ఉంటుందని తెలిపారు. మనిషి శరీరంలో రాత్రి పూటే ఫైలేరియా కదలికలు ఉంటాయన్నారు. రక్తపూతల ద్వారా ఈ వ్యాధి ఉందో లేదో గుర్తించవచ్చని పేర్కొన్నారు.

చర్యలు కొన్నింటిపైనేనా..?

- టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై విమర్శలు



మున్సిపల్ జేసీబీ సాయంతో ఓ లేఅవుట్‌లో బండరాళ్లను తొలగిస్తున్నారిలా..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల పనితీరు విమర్శలకు తావిస్తోంది. తమకు అనుకూలంగా ఉంటే ఒకలా... లేదంటే మరోలా అనే తరహాలో ఆ విభాగం అధికారులు పనిచేస్తున్నారు. ఇందుకు శనివారం జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్ 68లోని ఓ లేఅవుట్‌ను తొలగించడమే నిదర్శనంగా చెప్పవచ్చు. జిల్లా కేంద్రంలో 109 లేఅవుట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు ఆ విభాగం అధికారులే నిర్ధారించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోనూ లేఅవుట్లను ఏర్పాటు చేశారని వారికి ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు సైతం అనేకం అందాయి. కానీ వాటిపై కన్నెత్తైన చూడని టౌన్ ప్లానింగ్ అధికారులు అఘామేఘాల మీద ఓ లేఅవుట్‌లో పాతిన రాళ్లను మున్సిపల్ ట్రాక్టర్ల సాయంతో తొలగించడం వెనుక అంతర్యమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ విషయంపై టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సాయి కిరణ్‌ను సంప్రదించగా.. సంబంధిత కౌన్సిలర్ ఫిర్యాదు చేయగా, కమిషనర్ ఆదేశాల మేరకు తొలగించామన్నారు. మిగతా ఫిర్యాదులు అందిన లేఅవుట్లపై ఎలాంటి చర్యలు చేపట్టారని ప్రశ్నించగా అందుకు సరిపడా సిబ్బంది లేదని చెప్పడం గమనార్హం.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి హుస్సేన్

నేరడిగొండ: చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. మండలకేంద్రంలోని కేజీబీవీలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, లైంగిక వేధింపులు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి శంకర్, న్యాయవాదులు హరీశ్, విజయ్, ఎస్సై సాయన్న, మమత, సాహిన్ విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టా–చనాఖ బ్యారేజ్ (ఫైల్)



బడ్జెట్‌పై ఆశలు

- పెండింగ్ ప్రాజెక్టులకు నిధులొచ్చేనా..?
- అర్హులకు 'పోడు' పట్టాలు అందేనా
- కొత్త చెరువుల ప్రతిపాదనలకు మోక్షం లభిస్తుందా..
- రేపటి రాష్ట్ర బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి

సాక్షి, ఆదిలాబాద్: శాసనసభ శీతాకాల సమావేశాలు షురూ అయ్యాయి. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు సోమవారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ప్రధానంగా తెలంగాణ ప్రస్తుత ప్రభుత్వానికి ఇదే చివరి అసెంబ్లీ సమావేశమన్న ప్రచారం సాగుతోంది. ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం లేకపోలేదన్న అంశం రాజకీయ పార్టీల్లో చక్కర్లు కొడుతుంది. ఈ నేపథ్యంలో ఈ బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. జిల్లాకు సంబంధించి అనేక పెండింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్టుల పనులకు సంబంధించి బిల్లులు కూడా పెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉన్నాయి. అంతే కాకుండా కొత్త అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు కూడా రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ బడ్జెట్‌లో జిల్లాకు ఎలాంటి ప్రయోజనం ఒనగూరుతుందనేదే ఆసక్తికరం.

ఈసారైనా కుప్టికి మోక్షం లభిస్తుందా..

కుప్టి ప్రాజెక్ట్ టెండర్లకు సంబంధించి నిర్ణయంలో జాప్యం జరుగుతుంది. గతంలో రూ.846 కోట్ల అంచనా వ్యయంతో డిటేల్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) తయారు చేయగా, ఆ తర్వాత దాన్ని సవరించి మరో డీపీఆర్‌ను రూపొందించారు. ప్రాజెక్ట్ వ్యయం రూ.900 కోట్లకు పైగా అంచనా వేశారు. తాజాగా ఇటీవల సవరించిన ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం దీని అంచనా వ్యయం రూ.1,100 కోట్లకు చేరుకుంది. నేరడిగొండ మండలం కుప్టి గ్రామం వద్ద ఈ ప్రాజెక్ట్ నిర్మించదలిచారు. ఇక్కడినుంచి ప్రవహించే నీళ్లు దిగువన కడెం ప్రాజెక్ట్‌కు చేరుతాయి. గడిచిన వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు కడెం ప్రాజెక్ట్ వద్ద తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తుందని భావిస్తున్నారు. ఎగువన కుప్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మిస్తే భారీ వర్షాలు కురిసినప్పుడు కడెంకు వరద ప్రవాహం ముప్పు తప్పుతుందని నీటిపారుదల రంగం నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే దిగువ పెన్‌గంగ నది



కుప్టి ప్రాజెక్టు ప్రతిపాదిత స్థలం (ఫైల్)

భూభాగంలో నిర్మించిన కోర్టా–చనాఖ బ్యారేజ్ పనులు తుది దశకు వచ్చాయి. దీనికి సంబంధించి పిల్లకాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. భూసేకరణ చేయాలి. సుమారు రూ.200 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. అప్పుడే పనులు వేగవంతం అయ్యే అవకాశం ఉంది. పిప్పల్‌కోటి వద్ద రిజర్వాయర్ నిర్మాణ పనులు ఇంకా వేగం అందుకోలేదు. ప్రధానంగా భూసేకరణ, నిధుల సమస్య దీనికి కారణంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తిస్థాయిలో జరిగేందుకు ప్రభుత్వ పరంగా ఎలాంటి చర్యలు ఉంటాయనేది ఆసక్తి కలిగిస్తోంది.

ప్రతిపాదనలకు మోక్షం లభించేనా..

జిల్లాలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో రూ. 350 కోట్లతో 35 చెరువుల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. ఒక్కో చెరువు కింద సుమారు 200 ఎకరాల ఆయకట్టు ఉండేలా చూస్తున్నారు. అదే విధంగా 70 చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి రూ.120 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. సాత్నాల ప్రాజెక్టులో గడిచిన వర్షాకాలంలో భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు గేట్లపై నుంచి ప్రవాహం ముంచెత్తడం, భారీ వరద తాకిడితో ప్రాజెక్టులో అల్లకల్లోల పరిస్థితులు తలెత్తాయి. అప్పట్లో కేంద్ర బృందం ఈ ప్రాజెక్టును పరిశీలించి కొన్ని మార్పులకు సంబంధించి ప్రతిపాదనలు చేసింది. భారీ వరదలు వచ్చినప్పుడు చెరువుల మత్తడి దూకి ప్రవాహం బయటకు వెళ్లే రీతిలో ప్రాజెక్టు ఎడమ వైపు అలాంటి నిర్మాణం చేయాలని నిర్ణయించింది. ఇందు కోసం రూ.27 కోట్లు అంచనా వ్యయం అవుతుందని నిర్ధారించారు. ఈ బడ్జెట్‌లో ఈ ప్రతిపాదనలకు మోక్షం లభిస్తుందా అనేది చూడాల్సిందే.

ప్రతిపాదనలు అందించాం..



ఐటీ టవర్ నిర్మాణానికి సంబంధించి గత బడ్జెట్ సమావేశాల్లో పొందుపర్చగా తాజాగా మంజూరు లభించింది. దీనికి బడ్జెట్ కేటాయిస్తారు. అలాగే నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు చేశాం. ఈ బడ్జెట్‌లో వాటికి నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఇప్పటి వరకు వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం.

– జోగు రామన్న, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

కుప్టికి నిధులొచ్చే అవకాశం



కుప్టి ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉంది. బోథ్‌లో డిగ్రీ కళాశాల, ఫైర్‌స్టేషన్ నిర్మించాలని కోరుతాను. ఇచ్చోడలో డీఎస్పీ కార్యాలయం, బోథ్‌లో ఆర్డీవో కార్యాలయం కేటాయించాలని కోరడం జరిగింది. నియోజకవర్గంలో గిరిజన గూడెలు, తండాలకు రోడ్ల పనులకు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేశాం. మా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతుంది.

– రాథోడ్ బాపురావు, బోథ్ ఎమ్మెల్యే

పోడు పట్టాలు అందించేనా..

పోడు భూములకు త్వరలోనే పట్టాలు అందిస్తామని ఇటీవల నాగోబా జాతరకు వచ్చిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రకటించారు. ఈ సమావేశాల్లో దీనిపై ఏదైనా నిర్ణయం జరుగుతుందా అనేది ఆసక్తికరం. జిల్లాలో పోడు భూములకు సంబంధించి హక్కు పత్రాల కోసం 18,884 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 11,172 మంది గిరిజనులు, 7,712 మంది గిరిజనేతరులు ఉన్నారు. అయితే మొదట జిల్లాలో పోడు భూమి 56,140 ఎకరాల్లో ఉందని అధికారులు భావించారు. దరఖాస్తుల స్వీకరణ తర్వాత ఆ భూమి 72,592 ఎకరాల వరకు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపుతుందనేది ఆసక్తికరం.

పెరిగిన 'గౌరవం'

- మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఎట్టకేలకు గౌరవ వేతనం పెంపు
- రూ.వెయ్యి నుంచి రూ.3వేలకు..
- పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

జిల్లాలో..
ప్రభుత్వ పాఠశాలలు 1,124
మొత్తం విద్యార్థులు 79వేల మంది
మధ్యాహ్న భోజన నిర్వాహకులు 1,799మంది



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

బేల: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఎట్టకేలకు గౌరవ వేతనం పెరిగింది. రూ.వెయ్యి నుంచి రూ.3వేలకు పెంచుతూ ప్రభుత్వం గతంలోనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పాఠశాల విద్యాశాఖ నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో జిల్లాలో 1,799 మందికి లబ్ధి చేకూరనుంది.

పెంపు ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఏళ్లుగా చాలీచాలని గౌరవ వేతనంతో ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా తమ గౌరవ వేతనం పెంచాలని పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలో గత అసెంబ్లీ సమావేశాల్లో వీరి గౌరవ వేతనం రూ.వెయ్యి నుంచి రూ.3వేలకు పెంచుతామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీనిపై గత జూలైలో ఆర్థికశాఖ ఆమోదంతో జీవో సైతం విడుదలైంది. అయితే ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. ఎట్టకేలకు ఈ వేతనాల పెంపుపై పాఠశాల విద్యాశాఖ నుంచి శనివారం ఉత్తర్వులు విడుదల అయ్యాయి. కాగా, పూర్తిస్థాయి మార్గదర్శకాలు అందాల్సి ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకుల గౌరవ వేతన పెంపుపై ప్రభుత్వం నుంచి జీవో విడుదలైంది. గైడ్ లైన్స్ రావాల్సి ఉంది. వేతనాల పెంపు ఎప్పటి నుంచి అమలు అనేది ప్రభుత్వ ఆదేశానుసారం ఉంటుంది. – ప్రణీత, డీఈవో

సీసీఐ మూసివేతకు కేంద్రం కుట్ర

- ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్



మాట్లాడుతున్న నరేశ్ జాదవ్

కైలాస్‌నగర్: కేంద్ర బడ్జెట్‌లో కాటన్ కార్పొరేషన్ ఇండియా (సీసీఐ)కి కేటాయింపులు చేయకుండా ఆ సంస్థను కేంద్రం ఇన్‌డైరెక్ట్‌గా మూసేసిందని ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డి నివాసంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలోమాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీసీఐ పత్తిని కొనకపోవడం, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక రైతులు పత్తిని అమ్మలేకపోతున్నారన్నారు. ధర పెరుగుతుందనే ఉద్దేశంతో ఇళ్లలో నిల్వ చేసే పరిస్థితి లేక, చేలల్లోనే నిల్వచేసుకుంటన్నారని దాన్ని కాపాడుకునేందుకు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తికి గిట్టుబాటు ధర కల్పించక రైతులను నిలువునా మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. పెరిగిన విత్తన, ఎరువులు, పురుగుల మందులు, వ్యవసాయ పనిముట్ల ధరలతో సాగుపెట్టుబడి భారీగా పెరిగిందన్నారు. అయితే రైతుకు గిట్టుబాటు ధర అందక చేసిన అప్పు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడాల్సి వస్తోందన్నారు. ఒక్క రైతు బంధును అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్‌సబ్సిడీ, యంత్రలక్ష్మి, పంటబీమా, ఆత్మ వంటి వాటికి నిధులివ్వకుండా అన్నదాతకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ ఉద్యమిస్తూ వారికి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, నాయకులు నర్సింగ్‌రావు, సంజీవ్‌రెడ్డి, దిగంబర్‌రావు పాటిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా పరిశీలకులు శ్రీనివాసాచారి



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న శ్రీనివాసాచారి

ఆదిలాబాద్‌టౌన్: టీచర్ల బదిలీ, పదోన్నతుల ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా పరిశీలకులు శ్రీనివాసాచారి అన్నారు. ఉపాధ్యాయ బదిలీ దరఖాస్తులకు సంబంధించి డీఈవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. డీఈవో ప్రణీతను అడిగి వివరాలు తెలుసుకున్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఏమైనా పొరపాట్లు ఉంటే సవరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో 1605 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా, 1189 మంది వివరాలను ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు ఆయన వివరించారు. అలాగే 1,537 దరఖాస్తులను ఎంఈవోలు ఇప్పటివరకు డీఈవో కార్యాలయంలో సమర్పించారని తెలిపారు. వీటిలో పీజీ హెచ్‌ఎంలు 41, పీఎస్ హెచ్‌ఎంలు 19, ఎస్జీటీలు 857, స్కూల్ అసిస్టెంట్లు 488, లాంగ్వేజ్ పండిట్‌లు 119, పీఈటీలు 49, ఇతరులు ఐదుగురు దరఖాస్తు చేసుకున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీలోగా వీటిన్నింటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నట్లు వివరించారు. ముందుగా విద్యాశాఖ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఇందులో ఏడీ నర్సింహులు, సూపరింటెండెంట్ మధుసూదన్, సిబ్బంది తదితరులున్నారు.

ప్రమోషన్లు కల్పించాలని వినతి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్: భాషా పండితులు, పీఈటీలకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలని రాష్ట్ర పండిత ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలక పోచ్చన్న అన్నారు. భాషా పండితులు, పీఈటీలకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట గల అంబేద్కర్ విగ్రహానికి సంఘం ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ 2017 తెలుగు మహాసభల్లో ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన పదోన్నతుల ప్రక్రియలోనే తమకు అవకాశం కల్పించాలన్నారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో అసెంబ్లీని సైతం ముట్టడించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో హిందీ భాషా సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే, ఉపాధ్యాయులు జావిద్ అలీ, వై. వినాయక, శ్రీనివాస్, ప్రసాద్, రాజన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పొంతన లేని ఆడిట్

- సోషల్ ఆడిట్‌లో తేల్చిన దుర్వినియోగం రూ.లక్షల్లో..
- ప్రజా వేదికలో గుర్తించింది మాత్రం రూ.వేలల్లోనే
- నామమాత్రంగా రికవరీ.. చర్యలకు వెనుకంజ
- 'ఉపాధి' అక్రమాల్లో అధికారుల తీరుపై అనుమానాలు

సంవత్సరం	సోషల్ ఆడిట్‌లో తేలిన లెక్క	ప్రజావేదికలో తేల్చిన లెక్క	రికవరీ చేసింది
2018–19	రూ.46,44,160	రూ. 5,25,315	రూ.4,16,577
2019–20	రూ.19,89,904	రూ.4,57,531	రూ.3,57,257
2020–21	రూ.6,41,996	రూ.2,51,283	రూ.1,33,970
2021–22	రూ.1,88,330	రూ.76,677	రూ.60,896



తాంసి మండల కేంద్రంలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

కైలాస్‌నగర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులకు సంబంధించి జిల్లాలో నిర్వహించిన సోషల్ ఆడిట్, ప్రజా వేదిక ఆడిట్ లెక్కలకు పొంతన లేకుండా పోతోంది. హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారుల బృందం క్షేత్రస్థాయిలో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో లక్షలాది రూపాయలు దుర్వినియోగమైనట్లు తేల్చుతున్నారు. అదే డీఆర్డీవో నేతృత్వంలో నిర్వహించిన ప్రజావేదికలో రూ.వేలల్లోనే దుర్వినియోగమైనట్లుగా నిర్ధారిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. వారు తేల్చిన నగదును సైతం పూర్తిస్థాయిలో రికవరీ చేయకపోవడం, బాధ్యులపై చర్యలు చేపట్టకపోవడం ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తుంది. ఉపాధి హామీ పథకం నిధుల దుర్వినియోగంలో కిందిస్థాయి సిబ్బంది మొదలు అధికారుల వరకు ప్రమేయముండటంతోనే నిధుల దుర్వినియోగాన్ని దాచిపెడుతూ అక్రమార్కులపై చర్యలకు వెనుకాడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమార్కులకు 'ఉపాధి'

కూలీలకు వంద రోజుల పాటు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్న మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్రమాలకు వేదికవుతుంది. ఎలాంటి పనులు చేయకున్నా చేసినట్లుగా కొందరు రికార్డులు సృష్టించి బిల్లులు లేపుతుండగా, మరికొందరు పనులకు రాని వారి పేరిట జాబ్‌కార్డులు తీసుకుని బిల్లులను స్వాహా చేసిన ఘటనలు జిల్లాలో అనేకం వెలుగు చూశాయి. దీనిపై ఉన్నతాధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు సైతం అందాయి. క్షేత్రస్థాయిలో కూలీలకు అందాల్సిన నగదును కొంతమంది కాజేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులను తమ జేబులో నింపుకుంటున్నారు.

ఆడిట్ లెక్కలకు పొంతనేది..?

ఉపాధి హామీ పనులకు సంబంధించిన ఆడిట్ కోసం ఏటా హైదరాబాద్ నుంచి 15 డీఆర్‌పీలు జిల్లాకు వస్తుంటాయి. కూలీలను గ్రామానికి ఒకరు చొప్పున 15మందిని ఎంపిక చేసుకుని ఆయా మండలాల్లో చేపట్టిన పనుల తీరుపై క్షేత్రస్థాయిలో ఆడిట్ నిర్వహిస్తారు. ఇలా గడిచిన నాలుగేళ్లలో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో జిల్లావ్యాప్తంగా రూ.74లక్షల 64వేల 390 నిధులు దుర్వినియోగమైనట్లుగా లెక్క తేల్చారు. వాటిపై డీఆర్డీవో ఆధ్వర్యంలో మండల స్థాయిలో ప్రజా వేదికలు నిర్వహించగా నాలుగేళ్లలో కేవలం రూ.13లక్షల10వేల 806 మాత్రమే దుర్వినియోగమైనట్లుగా నిర్ధారించారు. ఈ రెండు ఆడిట్‌ల్లో తెల్చిన లెక్కల్లో రూ.61లక్షల 53వేల 584 తేడా కనిపిస్తోంది. అంటే క్షేత్రస్థాయిలో ఉపాధి కూలీలతో కలిసి నిర్వహించిన ఆడిట్ లెక్కా తప్పా.. లేక మండల స్థాయిలో అధికారులు ఉపాధి ఉద్యోగులు, సిబ్బందితో కలిసి నిర్వహించిన ఆడిట్ తప్పా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు ఆడిట్లలో పెద్ద మొత్తంలో నగదు తేడా ఉండటంతో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగదు దుర్వినియోగమైనట్లు తేల్చితే బాధ్యులపై చర్యలు చేపట్టాల్సి వస్తోంది. అదే జరిగితే అందులో తమ పాత్ర కూడా బయటపడుతుందనే ఉద్దేశంతో చర్యలకు వెనుకాడుతున్నట్లు విమర్శలున్నాయి.

రికవరీ కూడా

సోషల్ ఆడిట్ లెక్కను పక్కన పెడితే ప్రజావేదికలో తేల్చిన దుర్వినియోగమైన నగదును సైతం అధికారులు పూర్తిస్థాయిలో రికవరీ చేయడం లేదు. డీఆర్డీవో ఆధ్వర్యంలో సాగిన ప్రజావేదికలో రూ.13లక్షల 10వేల 806 దుర్వినియోగమైనట్లు తేల్చగా అందులో రూ.9లక్షల 68వేల 700మాత్రమే రికవరీ చేశారు. ఇంకా రూ.3లక్షల42వేల106 రికవరీ చేయాల్సి ఉంది. దుర్వినియోగానికి బాధ్యులైన వారిని గుర్తించినా నాలుగేళ్లుగా ఎందుకు ఆ నగదును రికవరీ చేయడంలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం బోథ్ ఎంపీడీవోపై మినహా పెద్దగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా అక్రమార్కులు తమకేం అవుతుందనే ధీమాతో నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

పని జరిగింది.. ఆధారాల్లేవు



ఉపాధి పనుల్లో భాగంగా క్షేత్రస్థాయిలో పనులు జరిగితేనే వాటికి కూలీల చెల్లింపులు జరుగుతాయి. కొన్నిసార్లు నాటిన మొక్కలు ఎండిపోవడం, వర్షాలతో అటవీ ప్రాంతంలో చేపట్టిన కందకాలు కొట్టుకుపోతాయి. దీంతో సోషల్ ఆడిట్ టీం సందర్శించిన సమయంలో వాటి ఆనవాళ్లు లేకపోవడంతో వారు పని జరగనట్లు నిర్ధారించి లెక్కలు వేస్తున్నారు. అయితే ప్రజావేదికలో కూలీల సమక్షంలో పనులు జరిగినట్లు తేలడంతో వాటిని సవరించి దుర్వినియోగాన్ని తగ్గిస్తున్నాం. సంబంధిత సొమ్మును బాధ్యుల నుంచి రికవరీ చేస్తున్నాం. – కిషన్, డీఆర్డీవో

క్లుప్తంగా

అనుమానాస్పదంగా ఒకరి మృతి

ఇచ్చోడ: అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని సిరిచెల్మ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై నీరేశ్ వివరాల ప్రకారం... రేకుల నారాయణ(55) కొంతకాలం నుంచి చేపల వేట కొనసాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం ఉదయం 7గంటల ప్రాంతంలో సిరిచెల్మలోని ఎల్లమ్మగుడికి వెళ్లే రోడ్డులో అనుమానాస్పదంగా పడి ఉండగా గ్రామస్తులు గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకుని చూడగా మృతిచెంది ఉన్నాడు. తల్లి సల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

పెంబి: మండలంలోని వేణునగర్ గ్రామానికి చెందిన సర్పంచ్ ఆత్రం రాధ శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై రజనీకాంత్ శనివారం వివరణ కోరగా వేణునగర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం వాస్తవమేనని, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. వారి కుటుంబీకుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

తానూరు: వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నర్సింగ్‌బాను తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని ఝరి(బి) గ్రామానికి చెందిన వివాహిత శుక్రవారం పొలంలో పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన చవాన్ అంబాదాస్, సయ్యద్ రసుల్ అత్యాచారానికి యత్నించారు. బాధితురాలు కేకలు వేయడంతో పారిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శనివారం తెలిపారు.

వివాహిత అదృశ్యం

భైంసాటౌన్: పట్టణంలోని నయాబాదికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ ఎస్సై ఎండీ గౌసుద్దీన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... భైంసాకు చెందిన ఫెరోజ్ అలీకి నవీపేట మండలం నాగేపూర్‌కు చెందిన సనా కౌసర్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం కలుగలేదు. శుక్రవారం ఉదయం నాగేపూర్‌కు వెళ్లేందుకు భార్యతో కలిసి భైంసా బస్టాండ్‌కు చేరుకోగా తనకు తల నొప్పి ఉందంటూ భార్య చెప్పడంతో మందుల కోసం ఫెరోజ్ వెళ్లి వచ్చేసరికి కౌసర్ కనిపించలేదు. దీంతో ఫెరోజ్ అలీ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సీతారాముల కల్యాణానికి గోటి తలంబ్రాలు


గోటితో వడ్లను ఒలుస్తున్న మహిళలు

దస్తురాబాద్:భద్రాచలంలో శ్రీరామనవమి రోజున నిర్వహించే స్వామివారి కల్యాణానికి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో గోటి తలంబ్రాలు పంపనున్నట్లు ఆలయ అర్చకుడు కొండమాచార్యులు తెలిపారు. శనివారం గోటి తలంబ్రాల తయారీకి శ్రీకారం చుట్టారు. 15వరకు తలంబ్రాలు ఒలువనున్నట్లు తెలిపారు. భాగ్యలక్ష్మి, లలిత, లక్ష్మి, సుగుణ, రాజవ్వ, శృతి ఉన్నారు.

ఈ సారైనా దూరం తగ్గేనా..?

- ఈ నెల 9 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలు
- గతంలో దూరంగా పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- 50శాతం మంది విద్యార్థులు గైర్హాజరు
- దూరం తగ్గించాలని విద్యార్థుల వేడుకోలు
- అనుకూల కేంద్రాల కోసం యాజమాన్యాల లాబీయింగ్


కాకతీయ యూనివర్సిటీ

కేయూ పరిధిలో...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం డిగ్రీ కళాశాలలు : 137

డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలు రాసే విద్యార్థులు : 18వేలు

ఈసారైనా పరీక్ష కేంద్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థులు కోరుతున్నారు. ఇటీవల డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి. ఇంకా కొన్ని జరుగుతున్నాయి. ఫిబ్రవరి 9వ తేదీ నుంచి డిగ్రీ మొదటి సంవత్సర పరీక్షలు మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలను దూరంలో కాకుండా స్థానికంగా ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. దూరంగా ఏర్పాటు చేస్తే పరీక్షలకు గైర్హాజరయ్యే పరిస్థితి లేకపోలేదు. – బోథ్

దూరాభారంతో పరీక్షలకు గైర్హాజరు...

డిగ్రీ పరీక్ష కేంద్రాలను ఏకంగా 25 నుంచి 40 కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేకపోతున్నారు. ఇటీవల జరిగిన డిగ్రీ పరీక్షలకు గ్రామీణ ప్రాంతాల్లోని 50శాతానికి పైగా విద్యార్థులు హాజరుకాలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుండగా 8.30లకు పరీక్ష కేంద్రంలో ఉండాలి. 25 నుండి 40 కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలంటే ప్రైవేటు ఆటోల్లోనే రావాల్సి వస్తోంది. ఉదయం 6.30లకు ఇంటి నుంచి బయలుదేరితే 8.30లకు పరీక్ష కేంద్రాలకు చేరుకుంటున్నారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా అలసిపోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

పరీక్ష కేంద్రాలు.. దూర ప్రాంతాలు

- బోథ్ మండలంలోని ఓ ప్రైవేటు కళాశాల సెంటర్ ఇటీవల ఇచ్చోడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఏర్పాటు చేశారు. బోథ్ నుంచి పరీక్ష కేంద్రం 25 కిలో మీటర్ల దూరంలో ఉంది. మండలంలోని నిగిని, కంటెగాం, రఘునాథ్‌పూర్, నారాయణపూర్, వజ్జర్, చింతల్ బోరితో పలు గ్రామాలకు చెందిన చాలా మంది విద్యార్థులు దూరాభారంతో పరీక్షలకు హాజరుకాలేదు. ఈ గ్రామాల నుండి ఇచ్చోడలోని పరీక్ష కేంద్రం దాదాపు 40 కిలోమీటర్ల దూరం. బోథ్ మండలంలోని దాదాపు 30 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.
- బజార్‌హత్నూర్ మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాల సెంటర్‌ను ఇటీవల కేవలం 7కిలో మీటర్ల దూరంలోని ఇచ్చోడ మండల కేంద్రంలో ఏర్పాటు చేయకుండా 23 కిలో మీటర్ల దూరంలోని నేరడిగొండలోని ప్రైవేటు కళాశాలలో ఏర్పాటు చేశారు. మండలంలోని అనేక గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. ఆటోలు కూడా సరిగా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి.
- నేరగిడొండ మండలంలోని ప్రైవేట్ కళాశాలల కేంద్రాలను ఇటీవల జరిగిన పరీక్షల్లో ఇచ్చోడలోని పలు ప్రైవేట్ కళాశాలల్లో ఏర్పాటు చేశారు. ఈ మండలంలోని మారుమూల ప్రాంతాలైన కుంటాల, గుత్పాల, వాంకిడిచ కొరిటికల్, తాండ్రతో పాటు పలు గ్రామాల్లోని విద్యార్థులకు దాదాపు 30 నుంచి 40కిలో మీటర్ల దూరం.

ఆదివాసీలపై చిన్న చూపు తగదు



డిగ్రీ పరీక్షల కేంద్రాలను దూరంగా ఏర్పాటు చేయడంతో ఆదివాసీ విద్యార్థులు పరీక్షకు హజరుకాలేకపోతున్నారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆదివాసీ విద్యార్థులపై చిన్నచూపుతో మాట్లాడటం తగదు. బస్సులు కూడా గ్రామాలకు రావు. ఆటోల్లో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండడంతో పాటు ఖర్చుతో కూడుకున్నది. మండల కేంద్రాల్లోనే ఏర్పాటు చేయాలి.
– భోజన్న, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు

భారంగా ప్రయాణం...

పరీక్ష కేంద్రం దూరంగా ఉండడంతో విద్యార్థులకు ప్రయాణం భారంగా మారింది. ఇంటి నుండి పరీక్ష కేంద్రానికి వెళ్లాలంటే ప్రతి రోజూ ఒక్కొక్కరికి రూ. 200 నుంచి రూ.300 ఖర్చు అవుతోంది. దూరం ఎక్కువ కావడంతో విద్యార్థినిలతో పాటు వారి కుటుంబీకులు కూడా వారితో వెళ్లాల్సిన పరిస్థితి. ఆయా మండలాల కేంద్రాల్లోనే ఇతర కళాశాలల్లో లేదా పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు దూరాభారం తగ్గుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

అనుకూల కేంద్రాల కోసం...

ఎప్పటిలాగానే డిగ్రీ పరీక్షల కేంద్రాలను అనుకూల కళాశాలలో ఏర్పాటు చేసుకోవడానికి యాజమాన్యాలు లాబీయింగ్ మొదలు పెట్టాయి. ఎమ్మెల్యేలతో యూనివర్సిటీ అధికారులకు ఫోన్లు చేయిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా నిర్మల్ జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ అధ్యాపకుడితో పలు యాజమాన్యాలు లాబీయింగ్ నిర్వహిస్తున్నాయని, విందుతో పాటు డబ్బులు ముట్టజెప్పుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీన్ని నిజం చేస్తూ ఇటీవల జరిగిన డిగ్రీ పరీక్షల్లో ఏకంగా 300 పైగా విద్యార్థులు డిబార్ అయ్యారు. అలాగే ఇచ్చోడలోని ఓ కేంద్రంలో విద్యార్థులు స్క్వాడ్‌బృందం కారుపై దాడి చేయడం కలకలం రేపింది.

నిర్లక్ష్యపు సమాధానం..

కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారికి 'సాక్షి' ఫోన్‌లో వివరణ కోరగా నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు. తమకు ఏ సెంటర్ ఎక్కడ వేయాలో తెలుసునని, ఆదిలాబాద్ ప్రాంతం తనకు తెలుసని, విద్యార్థులకు దూరమైనా పరీక్షలు రాయాల్సిందేనని పేర్కొన్నారు. వారే వచ్చి పరీక్ష రాస్తారని వివరణ ఇచ్చారు.

- ఇచ్చోడలోని ఓ కేంద్రం బస్టాండ్ నుండి 2 కిలో మీటర్ల దూరంలో ఉండడంతో ఓ విద్యార్థిని అంతదూరం నడవలేక తిరిగి ఇంటికి వచ్చేసింది. విద్యార్థినిలు దూరంగా ఉన్న కేంద్రాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

నేడు మందకృష్ణ మాదిగ రాక

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'తహసీల్దార్‌తో ప్రాణభయం'

- పోలీస్‌స్టేషన్‌లో ఎంపీటీసీ సభ్యురాలు ఫిర్యాదు


పోలీస్‌స్టేషన్ ఎదుట ఎంపీటీసీ, గ్రామస్తులు

కడెం: కడెం తహసీల్దార్ గజానన్‌తో తమ కుటుంబానికి ప్రాణభయం ఉందని మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు కట్ల సింధూజ ఆరోపించింది. ఈ మేరకు శనివారం పలువురు గ్రామస్తులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అంబారిపేట్ గ్రామ సర్పంచ్ భర్త లచ్చన్న భూకబ్జా విషయమై ఇటీవల తహసీల్దార్‌కు తన భర్త సాగర్ ఫిర్యాదు చేశాడని, అప్పటి నుంచి తన భర్తను వివిధ కేసుల్లో ఇరికించారని వాపోయింది. తహసీల్దార్ బారి నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట ట్రైబల్ టీచర్స్ యూనియన్ ధర్నా


ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టిన జేఏసీ నాయకులు

ఉట్నూర్: రాష్ట్రంలో ఆర్టికల్ 244(1) అనుసరించి యాజమన్యాల వారిగా ఉపాధ్యాయులకు మైదాన, ఏజెన్సీ ప్రాంతాలుగా బదిలీలు, ఏజెన్సీ ప్రాంతంలో పదోన్నతులు షెడ్యూల్ ట్రైబల్స్‌కి మాత్రమే కల్పించాలని శనివారం ట్రైబల్ టీచర్స్ యూనియన్ జేఏసీ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. షెడ్యూల్ ఏరియాలో ట్రైబల్స్‌కు మాత్రమే ఉద్యోగ అవకాశాలు, పదోన్నతులు కల్పించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగ బదిలీలు ఏజెన్సీ మైదాన ప్రాంతాలుగా నిర్వహించాలని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్ ప్రకటించాలని, మైదాన ప్రాంతాల్లో ఎస్సీ ఉపాధ్యాయులకు నూతన జిల్లాలో నూతన మెరిట్ కం రోస్టర్ విధానంలో పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మెస్రం గంగారాం, జేఏసీ నాయకులు కపిల్‌కుమార్, తిరుపతి, చంద్రకాంత్, గణేశ్, దేవేందర్, రామారావు, శ్యామ్‌రావు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్వేట ఉత్సవం


వేటకు వెళ్ల వస్తున్న లక్ష్మీనరసింహస్వామి

కడెం: అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు దేవతామూర్తులతో సమీపంలోని అడవిలోకి వేటకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వంశీకృష్ణామాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ బుర్ర రాజా రమేష్‌గౌడ్, భక్తులు ఉన్నారు.

గురుకులంలో విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాలి


ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న నాయకులు

సారంగపూర్: జామ్ సాంఘికసంక్షేమ బాలికల గురుకులంలో 5వ తరగతి విద్యార్థిని మహిత మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రాజన్న డిమాండ్ చేశారు. శనివారం పాఠశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ రమాకళ్యాణితో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో 620 మంది విద్యార్థులు ఉండగా, వారికి అనుగుణంగా స్నానాల గదులు, మరుగుదొడ్లు లేవన్నారు. దీంతో విద్యార్థులు రాత్రి 1 గంట వరకు క్యూలైన్‌లో నిలబడి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారని తెలిపారు. గీజర్లు లేకపోవంతో చలికాలంలో కూడా విద్యార్థులు చన్నీటి స్నానమే చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే ఏఎన్‌ఎంతో చికిత్స చేయించకుండా ఎంబీబీఎస్ స్థాయి వైద్యాధికారితో చికిత్స చేయించాలన్నారు. వసతి గృహం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ వేయాలని తెలిపారు. చనిపోయిన విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామలక్ష్మణ్, పీడబ్ల్యూవో జిల్లా కార్యదర్శి లక్ష్మి, ఏపీకేఎంఏ జిల్లా నాయకుడు మహమూద్ ఉన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

- పర్ధాన్ సమాజ్ పూజారి రమేశ్


కచ్చార్‌ఘడ్‌కు వెళ్తున్న పర్ధాన్ సమాజ్ కులస్తులు

ఆదిలాబాద్‌రూరల్: యువత ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకోవాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ పూజారి రమేష్ అన్నారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కచ్చార్‌ఘడ్ జాతరకు జిల్లా కేంద్రం నుంచి శనివారం పర్ధాన్ కులస్తులు బయలుదేరారు. అంతకుముందు ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల ఆదివాసీ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది పౌర్ణమిని పురస్కరించుకుని కచ్చార్ ఘడ్‌లో జాతర కొనసాగుతుందన్నారు. అందులో భాగంగానే ఈ నెల 5న నిర్వహించే పూజలకు తరలి వెళ్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు ఉన్నారు.

బాసరలో బ్రహ్మీ వార్షికోత్సవాలు


గోదావరి నది వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

భైంసా: బాసరలోని నైమిశారణ్యం భవనంలో ఏటా నిర్వహించే బ్రహ్మీ తీర్థ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురూజీ ఆర్కేరావు మాట్లాడుతూ.. మాఘమాసంలో చిన్నారులు బ్రహ్మీతీర్థం తీసుకోవడంతో విద్యాబుద్ధులతో పాటు ఉన్నత కార్యక్రమాలు చేపడతారని పేర్కొన్నారు. కుటుంబంలో సుఖశాంతులు కలుగుతాయన్నారు. అంతకుముందు నైమిశారణ్య భవనంలో ఉపనాయనం, మహా చండీయాగం చేపట్టారు. కార్యక్రమంలో మహారాష్ట్ర తెలంగాణ, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు.

మహారాష్ట్రలో ఖానాపూర్ ఎమ్మెల్యే ప్రచారం


మహారాష్ట్రలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం నిర్వహించే బీఆర్‌ఎస్ బహిరంగసభకు ప్రజలు హాజరుకావాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ కోరారు. ఈమేరకు నాందేడ్ తాలూకాలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించారు. మొదటిసారిగా మహారాష్ట్రలో జరిగే బీఆర్‌ఎస్ సభకు జన సమీకరణలో నిమగ్నమయ్యారు. ఆమె వెంట ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

దర్యాప్తు సరిగా ఉంటేనే శిక్షలు


అవగాహన కల్పిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్

నిర్మల్‌టౌన్: దర్యాప్తు సరిగా ఉంటేనే నేరస్తులకు శిక్షలు పడతాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో జిల్లా పోలీసు అధికారులకు కేసుల దర్యాప్తుపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో సైంటిఫిక్, టెక్నికల్ ఎవిడెన్స్ సేకరించి కోర్టులో ప్రవేశపెట్టాలని సూచించారు. అలాంటప్పుడే నేరస్తులు తప్పించుకోలేరని తెలిపారు. ఈనెల 11న జరగబోయే నేషనల్ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ కేసుల్లో ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో రాజీ అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో సీఐలు వినోద్, అజయ్ బాబు, వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి


ప్రసూతి ఆస్పత్రిలో వార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్


రోగికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

- మీరు పని చేయండి.. మీ వెంట నేనుంటా
- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- జిల్లా ఆసుపత్రి, ప్రసూతి ఆస్పత్రి తనిఖీ

నిర్మల్‌చైన్‌గేట్: వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లా ఆసుపత్రితోపాటు ప్రసూతి ఆసుపత్రిని శనివారం తనిఖీ చేశారు. ప్రతీ వార్డును సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రేడియాలజీ, టీపీ, డయాలసిస్, ఐసీయూ, ఆలన, ఆపరేషన్ థియేటర్, బ్లడ్ బ్యాంక్, ఆర్టీపీసీఆర్ కేంద్రం, టీహబ్ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా విభాగాల్లో మిషనరీ పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

రెఫర్ చేయొద్దు..

జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో బాలింతల వార్డులు, నవజాత శిశు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. నవజాత శిశు కేంద్రంలో 900 గ్రాముల బరువుతో జన్మించిన చిన్నారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు ఇక్కడే వైద్యం చేయాలని రెఫర్ చేయకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మీ వెంటే నేనుంటా...

జిల్లా ఆసుపత్రి సందర్శించిన సందర్భంగా కలెక్టర్ వైద్యులతో సమావేశం నిర్వహించారు. మీరు పని చేయండి.. మీ వెంట నేనుంటా అని వారికి భరోసా ఇచ్చారు. వైద్యులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఇటీవల రాష్ట్రంలోనే మొదటి స్థానంతో కాయకల్ప అవార్డు సొంత చేసుకున్నట్లు ముందు అదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను సామాన్య ప్రజలకు అందించేలా చూడాలన్నారు. ప్రస్తుతం వైద్యులందరూ కోఆర్డినేషన్‌తో పనిచేస్తున్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తిని ఇకమీదట కొనసాగించాలని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో వేణుగోపాలకృష్ణ, ఆసుపత్రి వైద్యులు ఉన్నారు.

బోనమెత్తిన కుంటాల


గజ్జలమ్మదేవికి పుష్పాలంకరణ


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు


హారతిలో పాల్గొన్న దంపతులు


శివసత్తుల నృత్యాలు

కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి ఆలయ తృతీయ వార్షికోత్సవం శనివారంతో ముగిసింది. ఆడపడుచులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. శ్రీగురుమంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో నిత్యవిధి, మహాపూర్ణ హారతి, కుంభాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి లక్ష పూలతో అలంకరణ చేశారు. అల్లడి కవిత– వెంకట నర్సయ్య ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి మహిళలతో కలిసి బోనమెత్తారు. శివసత్తుల పూనకలు, డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అప్పగజ్జారాం యాదవ్, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి, సర్పంచ్ సమత, సింగిల్ విండ్ చైర్మన్ సట్ల గజ్జారాం, బీజేపీ జిల్లా నాయకులు భోస్లే మోహన్‌రావు పటేల్ ఉన్నారు. – కుంటాల